క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు



ఆలయంలో హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణి దుర్గ అమ్మవారి హుండీ కానుకల ఆదాయం రూ.6,89,757లు వచ్చిందని ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. దేవాదాయశాఖ అధికారి జి.వి.బి.ఎస్.రవి కుమార్ పర్యవేక్షణలో శనివారం హుండీ కానుకల లెక్కింపు జరిగిందన్నారు. 78 రోజుల్లో ఈ ఆదాయం వచ్చిందన్నారు. లెక్కింపులో వేంకటేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ హితం కోరి..



జనపనార సంచులను పంపిణీ చేస్తున్న నేచర్ సేవ్ సొసైటీ ప్రతినిధులు

నరసన్నపేట: పెరుగుతున్న కాలుష్యం దృష్ట్యా పర్యావరణ హితం కోరి స్థానిక నేచర్ సేవ్ సొసైటీ ప్రతినిధులు శనివారం జనపనార సంచులు పంపిణీ చేశారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లతోపాటు పలువురు ఇళ్లకు వెళ్లి ఈ సంచులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు లుకలాపు రంజిత్, కోరుకొండ శాంతారావు మాట్లాడుతూ పట్టణంలో కాలుష్యం పెరుగుతుందని, ఎక్కడ చూసినా ప్లాస్టిక్ సంచులు కనిపిస్తున్నాయన్నారు. ఇది పర్యావరణానికి మరింత ముప్పు కలిగిస్తోందన్నారు. తమవంతుగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం కొంతైనా తగ్గించేందుకు ఈ విధంగా జనపనార సంచులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నేచర్ సేవ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

డీలర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

సరుబుజ్జిలి: మండలంలో ఖాళీగా ఉన్న రేషన్ డిపోల పోస్టులకు ఈ నెల 23వ లోగా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎల్.మధుసూదన్ శనివారం తెలిపారు. తెలికిపెంట (ఎస్సీ), చినమతలబుపేట (ఓసీ), పురుషోత్తపురం-2(ఓసీ), అలమాజీపేట(బీసీ-డి) కేటగిరిలకు చెందిన వారు అర్హులన్నారు. ఇంటర్ పాస్, ఫెయిలైనవారు, 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు గలవారు దరఖాస్తు చేయాలన్నారు. దరఖాస్తు అనంతరం రాత పరీక్ష ఉంటుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హిరమండలం: మండలంలోని కిట్టాలపాడు పంచాయతీ పూనిపేట మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు అర్హులైన స్థానిక అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ కొత్తూరు సీడీపీఓ విమలకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ పనిచేసిన అంగన్‌వాడీ కార్యకర్త అనారోగ్యంతో మృతిచెందడంతో ఈ పోస్టు ఖాళీ ఏర్పడిందన్నారు. రోస్టర్ విధానంలో బీసీ-'ఎ' కు చెందిన 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో మండలంలోని లొకొండ పంచాయతీ పరిధి మన్‌మాన్‌గూడ గిరిజన గ్రామంలో పీఎం జన్మన్ పథకంలో భాగంగా నూతనంగా అంగన్‌వాడీ హెల్పర్ పోస్టును మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హులైన ఎస్టీ మహిళలు ఈ నెల 10 లోగా దరఖాస్తును కొత్తూరు ప్రాజెక్టు కార్యాలయానికి అందజేయాలని కోరారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఎల్.ఎన్.పేట: మండలంలోని బొర్రంపేట గ్రామానికి చెందిన కింతలి అఖిల్, రామారావు, భానుమతిపై కేసు నమోదు చేసినట్లు సరుబుజ్జిలి ఎస్ఐ బి.హైమావతి శనివారం తెలిపారు. డ్రైనేజీలో మురుగునీరు వెళ్లకుండా అడ్డుకోవడంతో కింతలి రామారావు, కోట అప్పన్న కుటుంబాల మధ్య గొడవ జరిగింది. ఈ తగాదాను ఆపేందుకు వెళ్లిన బొడ్డేపల్లి రాము, కోట గున్నమ్మ, కోట అప్పన్నకు గాయాలయ్యాయి. బొడ్డేపల్లి రాము, కోట గున్నమ్మ, అప్పన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డుపై చెత్త వేస్తే చర్యలు



రోడ్డుకు ఆనుకొని వేసిన చెత్తను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ వసంతకుమారి

కొత్తూరు: రోడ్డుకు ఇరువైపులా చెత్త వేస్తే చర్యలు తప్పవని ఈఓపీఆర్డీ ఎస్.వసంత కుమారి హెచ్చరించారు. మండలంలోని మెట్టూరు పంచాయతీ పరిధిలోని ఏబీ రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు చెత్త వేయడంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ఈఓపీఆర్డీకి పలువురు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు చెత్త వేస్తున్న ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. సర్పంచ్ సూచించిన ప్రాంతం వద్ద చెత్త వేయించాలని పంచాయతీ కార్యదర్శికి ఈఓపీఆర్డీ ఆదేశించారు.

రెండున్నర దశాబ్దాలుగా.. అద్దె భవనమే దిక్కు



అద్దె భవనంలో కొనసాగుతున్న పీఏసీఎస్ కార్యాలయం

- సహకార సంఘానికి.. సొంత భవనం లేక ఇబ్బందులు
- సిబ్బందికి, రైతులకు తప్పని అవస్థలు
- సొంత స్థలం ఉన్నా నిధులు మంజూరు కాని వైనం..

ఎల్.ఎన్.పేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక రాయితీలను రైతులకు అందివ్వడంలో కీలకంగా పనిచేసేది ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్). రైతులకు చేరువగా ఉన్న వాటిలో వ్యవసాయశాఖ తరువాత పీఏసీఎస్ ఒకటని చెప్పడంలో సందేహం లేదు. ప్రభుత్వం తరపు నుంచి రైతులకు ప్రతీ ఏడాది ఎరువులు, విత్తనాలు, పంట పెట్టుబడి కోసం రుణాలు ఇవ్వడం, రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయడం వంటి ఎన్నో కార్యక్రమాలను నిర్వహించేది పరపతి సంఘమే. ఎల్.ఎన్.పేట మండంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఉన్న పీఏసీఎస్ కార్యాలయానికి గత 26 ఏళ్లుగా సొంత భవనమే లేకుండా పోయింది. ఇక్కడ పనిచేసే ఉద్యోగులు, పరిపాలన కార్యకలాపాలను నిర్వహించే పాలకులు, పనులపై వచ్చే రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

సొంత స్థలం ఉన్నప్పటికీ..

పీఏసీఎస్ భవన నిర్మాణం కోసం గ్రామంలోను సొంత స్థలం ఉంది. అయినప్పటికీ రెండున్నర దశాబ్దాలుగా భవన నిర్మాణం చేసేందుకు నిధులు మంజూరు కాలేదు. ఎప్పటికప్పుడు పీఏసీఎస్ అధ్యక్షులు, డైరెక్టర్లు, కార్యదర్శితోపాటు రైతులు, సిబ్బంది చేపట్టే పాలకవర్గ సమావేశాలు నిర్వహించేందుకు సరైన సదుపాయాల్లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

లక్ష్మీనర్సుపేట గ్రామంలో 26 ఏళ్ల క్రితం పీఏసీఎస్‌ను ఏర్పాటు చేశారు. 1999లో ఎల్.ఎన్.పేట మండలం ఏర్పడింది. మండలంలో లక్ష్మీనర్సుపేట, తురకపేటలో పీఏసీఎస్‌లు ఉండేవి. పరిపాలన సౌలభ్యం కోసం పదిహేన్నేళ్ల క్రితం మండలానికి ఒక పీఏసీఎస్‌ను ఏర్పాటు చేశారు. ఎల్.ఎన్.పేట మండలం లక్ష్మీనర్సుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన పీఏసీఎస్‌లో ఎల్.ఎన్.పేట మండలంలోని అన్ని గ్రామాలతోపాటు సరుబుజ్జిలి మండలానికి చెందిన మతలబుపేట, గోనెపాడు, బప్పడాం, చిన్నమతలబుపేట గ్రామాలను కలిపారు. ఈ పీఏసీఎస్‌లో ప్రస్తుతం 55 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాలకు చెందిన 6,838 మంది రైతులు సభ్యత్వాన్ని తీసుకున్నారు. ప్రతీ ఏడాది రూ.4.5 కోట్లు రుణాలు ఇవ్వడంతోపాటు ఆయా రుణాలను రివకరీ చేస్తున్నారు.

పరిపాలన ఇబ్బందే



సొంత భవనం లేకపోవడంతో పరిపాలన పరంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో పీఏసీఎస్ కార్యాలయం కోసం అద్దెకు భవనాలు లభించటం లేదు. శిథిల భవనంలోనే పరిపాలన కొనసాగిస్తున్నారు. రెండున్నర దశాబ్దాల్లో ఎనిమిది సార్లు అద్దె భవనాలు మార్చాల్సి వచ్చింది. పరిపాలన పరంగా ఇబ్బంది కరంగానే ఉంటుంది.

– కొల్ల కృష్ణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, లక్ష్మీనర్సుపేట

పాలకులు చొరవతీసుకోవాలి



రుణాలు, ధాన్యం విక్రయం, ఎరువులు తదితర అవసరాలు కోసం లక్ష్మీనర్సుపేట గ్రామంలోని పీఏసీఎస్‌కు వెళ్తే ఇబ్బందికరంగా ఉంటుంది. బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా కూర్చునేందుకు స్థలం తక్కువగా ఉంది. పాత భవనంలో అద్దెకు ఉంటున్నారు. పక్కా భవనం నిర్మించేందుకు అధికారులు, పాలకులు చొరవ తీసుకోవాలి.

– పి.అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

వలంటీర్ల ఆందోళనకు మద్దతు ఇవ్వాలి



రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే, పాతపట్నం

ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామ, వార్డు వలంటీర్లను నిర్లక్ష్యంగా తొలగించడంతో వారు చేపడుతున్న ఆందోళనకు అన్ని వర్గాల వారు మద్దతు ఇవ్వాలని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో కోరారు. వలంటీర్లను కొనసాగిస్తామని ఎన్నికల ముందు చెప్పిన సీఎం చంద్రబాబు, కూటమి నాయకుల మాటలు ఏమయ్యాయని నిలదీశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్నా.. వలంటీర్లను ఎందుకు కొనసాగించటం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లకు నెలకు రూ.10 వేల జీతం ఇస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు.. ఇప్పుడు ఎందుకు వారిని నియమించటం లేదన్నారు. బుడమేరు వరద సమయంలో ఆయా వార్డుల్లో పనిచేసిన వలంటీర్ల సేవలను వినియోగించుకున్న ఈ ప్రభుత్వం వారిని ఎందుకు కొనసాగించలేదన్నారు. చంద్రబాబు చేతిలో మోసపోయామని గ్రహించిన వలంటీర్లు ఆందోళనకు దిగారని, వారికి అన్ని వర్గాలవారు అండగా నిలవాలని రెడ్డి శాంతి పిలుపునిచ్చారు.

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా సమన్వాధికారి బాలాజీ

పాతపట్నం: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఇప్పటినుంచే విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వాధికారి ఎస్.బాలాజీ అన్నారు. మండలంలోని ప్రహరాజపాలెంలో ఉన్న డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని, పదో తరగతి, ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ సబ్జెక్టుపై పలు పశ్నలు వేసి జవాబులు రాబట్టారు. విద్యార్థులకు పెడుతున్న భోజనంపై ఆరా తీశారు. డార్మిటరీ, వంట గది, మరుగుదొడ్లను పరిశీలించారు. ప్రిన్సిపాల్ వి.అర్చన, అకడమిక్ టీమ్ కె.వి.రామ్మూర్తి, కె.నీలాద్రి, జె.యోగేశ్వరరావు, డి.సుదర్శనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన

పొందూరు: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన కిశోర వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్‌కు సోపానం వంటిదని తాడివలస పీహెచ్‌సీ వైద్యుడు రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని తాడివలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో కిశోర వికాసం కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు.

బాల్య వివాహాల వలన నష్టాలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, పోక్సో చట్టం వంటి పలు అంశాలను వివరించారు. హెచ్‌ఎం బి.కంటయ్య, ఉపాధ్యాయులు, పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.50 వేల వితరణ



హిరమండలంలోని ప్రేమసాయి వృద్ధాశ్రమానికి ఢిల్లీ నగరంలో నివాసం ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పుల్లాభట్ల రాజశేఖర్ రూ.50 వేలను శనివారం ఆశ్రమ కోఆర్డినేటర్ సాయిబాబాకు అందజేశారు. ఆశ్రమ సేవలను కొనియాడారు. ఆశ్రమ అభివృద్ధికి ఈ నిధులు వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. ఆశ్రమ అభివృద్ధిలో భాగాస్వామ్యం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సత్యసాయి సేవా సంస్థల జోనల్ కన్వీనర్ బి.సురేష్, ఆశ్రమ కమిటీ సభ్యులు జోషుల గోవిందశర్మ, మేనేజర్ జయరాం, ఆశ్రమవాసులు నర్సింహమూర్తి, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

– హిరమండలం

కట్టిజనుము సాగుతో మేలు



ఈ చిత్రం బూర్జ మండలంలోని అన్నంపేటలో సాగు చేస్తున్న కట్టిజనుము. మండలంలో సుమారు 50 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కట్టిజనుమును నూనె గింజలుగా వినియోగించడంతో మార్కెట్‌లో మంచి ధర పలుకుతోంది. కొంత మంది రైతులు ఖరీఫ్ పంటలో కలియదున్ని పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగిస్తున్నారు. ఈ సాగుపై రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. మండలంలోని అయ్యవారిపేట, అన్నంపేట, కొమ్మువలస, బూర్జ తదితర గ్రామాల్లో సాగు చేస్తున్నారు.

– బూర్జ

వెన్నతో అలంకరణ



సారవకోట మండలంలోని చీడిపూడి కల్యాణ వేంకటేశ్వర స్వామికి శనివారం 25 కేజీల వెన్నతో అలంకరించారు. ఈ ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామిని వెన్నతో అలంకరించి ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

– సారవకోట

కర్పూర సేవ



పాతపట్నం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌కు సమీపంలో ఉన్న వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారిని శనివారం క్షీర సాగర పచ్చ కర్పూర సేవతో పాటు పత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అష్టోత్తర శతనామావళితో పూజలు చేపట్టారు. పాతపట్నం, కొరసవాడ పరిసరాల ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి స్వామివారిని దర్శించుకున్నారు.

– పాతపట్నం

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



పాతపట్నం: విద్యార్థులకు ప్రశంసాపత్రం, మెమొంటోతో సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



కొత్తూరు: విద్యార్థులకు సత్కరిస్తున్న ఎంఈఓలు, హెచ్‌ఎం



సరుబుజ్జిలి: విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

పాతపట్నం: విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికి తీయడానికి పోటీ పరీక్షలు దోహదం చేస్తాయని పెద్దసీది హైస్కూల్ హెచ్‌ఎం బి.రామ్మూర్తి అన్నారు. పాతపట్నం ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఏపీ బయలాజికల్ సైన్స్ ఫారం ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌ను శనివారం నిర్వహించారు. టాలెంట్ టెస్ట్ పశ్నపత్రాలను హెచ్‌ఎం, సైన్స్ ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన రొంపివలస జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ధనుష్, అభినయ్, స్నేహలతలు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరికి ప్రశంసాపత్రాలు, మెమొంటోలతో నిర్వాహకులు సత్కరించారు. సైన్స్ ఉపాధ్యాయులు రామారావు, శ్రీనివాసరావు, అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి బయోలజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 8, 9, 10వ తరగతికి చెందిన విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ శ్రీనివాసరావు, గోవిందరావు తెలిపారు. విజేతలకు ఎంఈఓలు, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

సరుబుజ్జిలిలో..

సరుబుజ్జిలి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని ఎంఈఓ కె.శ్రీనివాసరావు తెలిపారు. మండలలోని 7 హైస్కూళ్లలో చదువుతున్న 9, 10వ తరగతి విద్యార్థులకు శనివారం బయోలజీ ఫోరం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో గోనెపాడు పాఠశాల విద్యార్థులు ప్రథమ, పురుషోత్తపురం హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. విద్యార్థులకు షీల్డ్, ప్రశంసాపత్రాలను అందించారు.

ఆటపాటలతో బోధన



ప్రీస్కూల్ డేలో పాల్గొన్న సూపర్ వైజర్ లక్ష్మీభాయి, తదితరులు

ఆమదాలవలస: అంగనవాడీ కేంద్రం ప్రీస్కూల్ విద్యార్థులకు ఆటపాటలతోనూ, బొమ్మలు చూపించడం ద్వారా బోధన చేయాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) సూపర్‌వైజర్ పి.లక్ష్మీబాయి అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. శనివారం అక్కులపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీస్కూల్ విద్యార్థులకు అందిస్తున్న బోధనా విధానాన్ని అడిగి తెలుసుకోవడంతోపాటు, పోషకాహారం సక్రమంగా అందించాలని సూచించారు. ప్రీస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పౌష్టికాహారం అందుతున్న తీరు, విద్యార్థులకు అందిస్తున్న బోధనా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్త జి.అమ్మాజీ, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రూ.20 వేల ఆర్థికసాయం

పాతపట్నం: మండలంలోని కొదూరు పంచాయతీ సూర్యనారాయణపురం గ్రామానికి చెందిన కురమాన మహాలక్ష్మి క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆమె వైద్య సహాయం కోసం పాతపట్నం మండల కేంద్రానికి చెందిన సైలాడ సతీష్‌తోపాటు స్నేహితులు కలిసి రూ.20,201 వేలను శనివారం అందజేశారు. ఆర్థికసాయం అందజేసిన వారిలో సన్యాసిరావు, సంతోష్‌కుమార్, మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.

అంధులకు ఆదర్శం లూయి బ్రెయిలీ



హిరమండలం: బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



సరుబుజ్జిలి: మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

హిరమండలం: అంధులకు ఆదర్శం లూయి బ్రెయిలీ అని స్థానిక ప్రభుత్వ ఉన్న పాఠశాల హెచ్‌ఎం టీ.కేశవరావు అన్నారు. లూయి బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని శనివారం పాఠశాల ఆవరణంలో ఉన్న భవిత కేంద్రంలో బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఆర్‌టీ ఉపాధ్యాయులు సీతంనాయుడు, గోవిందరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంధుల స్ఫూర్తిదాత బ్రెయిలీ..

సరుబుజ్జిలి: అంధుల లిపికి మూలకారకుడు బ్రెయిలీ అని ఎంఈఓ కె. శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం బ్రెయిలీ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సరుబుజ్జిలి హైస్కూల్ హెచ్‌ఎం బొత్స వెంకటరమణ, ఐఈఆర్టీ ఉపాధ్యాయులు జగన్నాథరావు, ఢిల్లేశ్వరరావు, అలేఖ్య పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో ఎండీఎం ప్రారంభం



మెళియాపుట్టి: విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న అధికారులు

ఆమదాలవలస/పాతపట్నం/నరసన్నపేట: ఆమదాలవలస పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం ప్రారంభించారు. బూర్జ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎండీఎంను కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎస్.తవిటినాయుడు, పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎండీఎంను, ప్రిన్సిపాల్ మల్లేశ్వరరావు, కింతలి జూనియర్ కళాశాలలో ఎండీఎంను ప్రిన్సిపాల్ సునీత ప్రారంభించారు. నరసన్నపేట నియోజకవర్గంలోని సారవకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎండీఎంను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల ప్రత్యేకాధికారి ఎం.లోకనాథం , జలుమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎండీఎంను ప్రిన్సిపాల్ జామి సారిక ప్రారంభించారు.

పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎండీఎంను మండల ప్రత్యేకాధికారి డాక్టర్ కరుణాకరరావు, ఎల్.ఎన్.పేట మండలంలోని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎండీఎంను ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, హిరమండలం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎండీఎంను తహసీల్దార్ హనుమంతురావు, ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్, మెళియాపుట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎండీఎంను మండల ప్రత్యేకాధికారి మధుబాబు, ఎంపీడీఓ నర్సింహప్రసాద్ పండా ప్రారంభించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పొట్టేళ్లకు భలే డిమాండ్



చింతాడ సంతలో పొట్టేళ్లు

ఆమదాలవలస: సంక్రాంతి పండగ సమీపిస్తున్న తరుణంలో కోసం గొర్రెపోతుల (పొట్టేళ్లు) కొనుగోలుకు ఆమదాలవలస పట్టణ శివార్లలోని చింతాడ గ్రామంలో వారపు సంతకు శనివారం కొనుగోలుదారులు, అమ్మకందారులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. సంక్రాంతి ముందు వచ్చే వారపు సంత మరొకటి ఉన్నప్పటికీ ముందుగా కొనుగోలు చేసుకుంటే ధరలు తక్కువగా ఉంటాయని కొనుగోలుదారులు చేరుకునే సరికి పొట్టేళ్లకు డిమాండ్ పెరిగింది. పది కిలోల బరువు ఉండే పొట్టేళ్లు గతంలో రూ.8 వేల నుంచి రూ.9 వేల వరకు ఉండేవి. ప్రస్తుతం వీటి ధర రూ.12 వేల వరకు పలికిందని స్థానికులు చెబుతున్నారు. బరువు మేరకు ఒక్కో పొట్టేలుపై వేల రూపాయలు అధికంగా పెరిగాయని చర్చించుకుంటున్నారు. మరో వారం సంత ఉంది కదా అంటూ కొంతమంది వెనుదిరిగి వెళ్లిపోయారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే రవికుమార్

బూర్జ: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని తోటవాడలో తహసీల్దార్ వై.వి.పద్మావతి ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో ఉన్న పలు భూ సమస్యలను అక్కడికక్కడే తహసీల్దార్ చెప్పి పరిష్కరించాలని ఆదేశించారు. మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, పలువురు అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ..



పాపారావు మాస్టార్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: పట్టణంలోని బి.ఆర్.నగర్‌లో నివాసం ఉంటున్న రోటరీ క్లబ్ రొటేరియన్ పాత్రుని పాపారావు మాస్టార్ కుమారుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు తమ్మినేని సీతారాం శనివారం పరామర్శించారు. శ్రీకాకుళంలో నివాసం ఉంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు సువ్వారి అచ్చంనాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని తమ్మినేని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పొన్నాడ చిన్నారావు, బొడ్డేపల్లి నిరంజన్, కె.వి.రమణమూర్తి, పేడాడ రమణ, తదితరులు ఉన్నారు.